నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెడ్‌బిల్డింగ్, బాలాజీనగర్ పరిధుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అడిక్‌మెట్ పరిధిలో 11.30 నుంచి 1 వరకు, ఎల్ఎన్‌నగర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

పేదలకు ఉచిత వైద్యం అందించాలి: ఎమ్మెల్యే

నల్లకుంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ ఆస్పత్రులు పేదలకు ఉచిత వైద్యం అందించడంపై శ్రద్ధ వహించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లో కేర్ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్పొరేట్ ఆస్పత్రులు నగరంలోని మురికివాడల ప్రాంతాలలో వైద్య శిబిరాలను నిర్వహించి పేదలకు ఉచిత వైద్యం అందించాలని కోరారు. జనరల్ ఫిజిషియన్ డా.నరేశ్, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డా. రామ్‌బాబుల నేతృత్వంలోని వైద్య బృందం ప్రజలకు వైద్య చికిత్సలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, నాయకులు విజయ్‌సాగర్, ప్రదీప్‌రావు, శరత్, మూర్తి, నరేంద్ర పాల్గొన్నారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ సేవలు మరువలేనివి

● ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దుర్గాబాయి దేశ్‌ముఖ్ సేవలు మరువలేనివని, నేటి యువత ఆమెను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం సూచించారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ 58వ జయంతి వేడుకలను పురస్కరించుకుని మంగళవారం విద్యానగర్‌లోని దుర్గాబాయిదేశ్‌ముఖ్ ఆస్పత్రి ఆడిటోరియంలో స్మారక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి నాణ్యమైన విద్య, ఉచిత వైద్య చికిత్సలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ చేసిన సేవలు మరువలేనివని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళ సభ అధ్యక్షురాలు ఉషాకందా, ఉపాధ్యక్షురాలు లక్ష్మి సుందరి, కార్యదర్శి లలితా కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ సాయిరామ్‌తో సమావేశమైన కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

ఇళ్ల కేటాయింపు ఎప్పుడు?

● ఆర్డీవోను ప్రశ్నించిన కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ స్వామి వివేకానందనగర్ బస్తీలో 19 మంది దళితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎప్పుడు కేటాయిస్తారని కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ ఆర్డీఓను ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరామ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి మాట్లాడారు. స్వామి వివేకానందనగర్ బస్తీలో దళితుల నివాసాలను మున్సిపల్, రెవెన్యూవారు కూల్చివేశారని, వారికి డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని కోరారు. ఏడాదిన్నరగా పేదలకు పునరావాసం కల్పించడంలో జాప్యం ఎందుకు జరుగుతుందని ఆర్డీవోను కార్పొరేటర్ ప్రశ్నించారు. స్పందించిన ఆర్డీవో ఇళ్ల మంజూరు పూర్తయిందని, త్వరలోనే కుటుంబాల వారీగా కేటాయింపు ప్రక్రియను పూర్తిచేస్తామని చెప్పారని కార్పొరేటర్ తెలిపారు. కార్పొరేటర్ వెంట బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, బస్తీవాసులు కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు ఉన్నారు.

ముషీరాబాద్ బీఆర్ఎస్‌దే: శ్రీధర్‌రెడ్డి

ముషీరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో బీఆర్ఎస్ బలమైన శక్తిగా మారిందని ముషీరాబాద్, అడిక్‌మెట్ పార్టీ డివిజన్ అధ్యక్షులు శ్రీధరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావును ముషీరాబాద్, అడిక్‌మెట్ డివిజన్ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, శంకర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, పూసగోరక్‌నాథ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు తగిన చర్యలు: డీఎంసీ

రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట సర్కిల్ పరిధిలో డెంగీ నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని డీఎంసీ మారుతి దివాకర్‌రావు తెలిపారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని రెడ్‌బిల్డింగ్ ప్రాంతంలో డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఉన్న ఇంటిని మంగళవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ పద్మావెంకటేష్

ఆలయాల అభివృద్ధికి కృషి: మాజీ కార్పొరేటర్

గోల్నాక, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రేణుకా ఎల్లమ్మ, నాగదేవత దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మావెంకటేష్ అన్నారు. తిరుమలనగర్‌లోని రేణుకా ఎల్లమ్మ, నాగదేవత దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మాజీ కార్పొరేటర్‌ను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జైహింద్, ప్రతినిధులు తూర్పు రామచందర్‌రావు ముదిరాజ్, నరోత్తంరెడ్డి, మాధవరెడ్డి, ఆరికారెడ్డి రజిత, సూర్యకళ, మాధవి, లలిత, మణి, వల్లి, ప్రభ, సుగుణ, ఊర్మిల తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భారతీయ శాస్త్రీయ నృత్యోత్సవం

చిక్కడపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భారతీయ శాస్త్రీయ నృత్యోత్సవం అలరించింది. ప్రముఖ శాస్త్రీయ నృత్యసంస్థ కళా మండప (బెంగళూరు) ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయగానసభలో సంస్థ స్థాపకులు బిను తాగిన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దీప భూమిరావు కూచిపూడి, మస్కట్ నుంచి వచ్చిన దీక్ష భరతనాట్యం, రమ్య ఒడిస్సీ, కవిత, మాధవీకథక్, సాత్విక ధృతిసూర్యప్రకాష్ తదితరులు వివిధ నృత్య ప్రక్రియలను ఆకర్షణీయంగా ప్రదర్శించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ కథక్ నృత్యగురువు డా.అంజుబాబు కళాకారులకు జ్ఞాపికలు బహూకరించారు. కస్తూరి కళా క్షేత్ర స్థాపకులు ప్రియాంక మిశ్రా కళామండప కృషిని అభినందించారు.

బోనాలకు వేళాయె

- 244 ఏళ్ల చరిత్ర ఈ దేవాలయం సొంతం
- ఈ నెల 20, 21 తేదీల్లో ఉత్సవాలు





కొలువుదీరిన అమ్మవారు, నింబోలిఅడ్డాలోని అమ్మవారి దేవాలయం

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భక్తులు కోరిన కోర్కెలను తీర్చే చల్లని తల్లిగా మహాకాళి అమ్మవారు ప్రసిద్ధి చెందారు. నిత్యం పూజలు అందుకుంటున్నారు. అమ్మ వేడుక అయిన బోనాల ఉత్సవాలు మరో నాలుగు రోజుల్లో ప్రారంభంకానున్నాయి. అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. యేటా పటేల్‌జంగులగౌడ్ వంశీయులు వేడుకలను నిర్వహిస్తారు. భక్తకోటి నీరాజనాలను అమ్మవారు అందుకోనున్నారు. కాచిగూడ డివిజన్ నింబోలిఅడ్డలోని మహాకాళి దేవాలయానికి 244 ఏళ్ల చరిత్ర ఉంది. పటేల్‌జంగులు గౌడ్ ఆలయాన్ని నిర్మించారు. రెండు శతాబ్దాల క్రితం ఈ ప్రాంత ప్రజలు అంటువ్యాధులతో బాధపడుతున్న సమయంలో వాటి భారీ నుంచి రక్షించాలని కోరుతూ ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. వ్యాధులు తగ్గిపోవడంతో ఆనాటి నుంచి బోనాల ఉత్సవాలను అంగరంగవైభంగా నిర్వహిస్తున్నారు. పటేల్‌జంగులుగౌడ్ వంశీయుడు, మునిమనవడు రాజేందర్‌పటేల్‌గౌడ్ ఆధ్వర్యంలో మహాంకాళి ఆలయంలో యేటా ఉత్సవాలు జరుగుతున్నాయి. కాచిగూడతో పాటు బర్కత్ పుర, ఇసామియాబజార్, గోల్నాక, అంబర్‌పేట తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు.

బోనాల ఉత్సవాలు....

ఈ నెల 20, 21వ తేదీలలో బోనాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త రాజేందర్ పటేల్‌గౌడ్ తెలిపారు. ఈ నెల 19న ఘటాల ఊరేగింపుతో వేడుకలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆదివారం తెల్లవారు జాము 4 గంటల నుంచే బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయని రాత్రి 12 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు అమ్మవారికి బోనం సమర్పిస్తారని అదే రోజు మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు పచ్చికుండ కార్యక్రమం, బలి గంప, ఫలహారం బండ్ల ఊరేగింపు ఉంటుందని చెప్పారు. ఉత్సవాల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీలు డా.లక్ష్మణ్, ఈటల రాజేందర్, విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే. అరుణ, అర్వింద్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొంటారని ఆలయ ధర్మకర్త తెలిపారు.



శ్రీలక్ష్మీనగర్‌లోని నల్లపోచమ్మ అమ్మవారు

బోనాల ఉత్సవాలకు నల్లపోచమ్మ ఆలయం ముస్తాబు

గోల్నాక, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలకు గోల్నాక శ్రీలక్ష్మీనగర్‌లోని శ్రీదేవి నల్లపోచమ్మ దేవాలయం ముస్తాబవుతుంది. ఈ నెల 20న జరిగే బోనాల ఉత్సవాలకు ఆలయానికి రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ఆలయ కమిటీ పక్షాన బోనం సమర్పించనున్నట్టు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొమ్మిడి గోపాల్‌రెడ్డి తెలిపారు. అలాగే తొట్టెల ఊరేగింపు, ఫలహారం బండ్ల ఊరేగింపు ఉంటాయని చెప్పారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ పాల్గొంటారని ఆయన చెప్పారు.

ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి: లింబాద్రీ

రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకుని, ఆ లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేయాలని ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా సంస్థల సీఈవో ప్రొఫెసర్ లింబాద్రీ సూచించారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా సంస్థలో విద్యార్థుల ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యా రంగంలో వస్తున్న నూతన అంశాలను విద్యార్థులు అవగాహన చేసుకుని లక్ష్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. అనంతరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజేస్ (ఐపీఈ) సంచాలకులు, ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికతో చదివి భవిష్యత్తులో ఉన్నత రంగంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి రమణకుమార్, డైరెక్టర్లు యాదగిరి, ప్రొఫెసర్ విష్ణుప్రియ, ప్రిన్సిపాల్ మట్ట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్, ప్రొ. లింబాద్రీ

విద్యార్థులకు లయన్స్‌క్లబ్ సహకారం

చిక్కడపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): యూత్ స్కిల్స్ డేను పురస్కరించుకుని మంగళవారం అశోక్‌నగర్‌లోని డా. హిప్నోకమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ హాల్‌లో విద్యార్థులకు లయన్స్‌క్లబ్ వారు ఆర్థిక సహాయం అందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నవభారత్ అధ్యక్షుడు డా. హిప్నో పద్మాకమలాకర్స్ టీమ్ వారు చదువులో ప్రతిభ చూపుతూ ఆర్థికంగా వెనుకబడ్డ ముగ్గురు విద్యార్థులు హేమలత, అనిల్, ధ్రువకు ఆర్థిక సహకారం అందించారు. అదే విధంగా లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో టీవీని అందజేశారు. లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా. మహేంద్ర, కుమార్‌రెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ రామచంద్రన్, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ విద్యాసాగర్, గోపాలకృష్ణ కృష్ణవేణి, లక్ష్మి, జయశ్రీ, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.



ఓయూ వీసీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పద్మ

బోనాల పండుగకు ఓయూ గేట్ తెరవండి

● కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మోహిన్ చెరువు కట్టపై ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయంలో భక్తులు బోనాలు సమర్పించేందుకు ఈ నెల 20, 21న ఉస్మానియా యూనివర్సిటీ గేట్ తెరవాలని కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి ఓయూ అధికారులకు కోరారు. ఈ మేరకు మంగళవారం ఓయూ వీసీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, గోవింద్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం: మురళీకృష్ణ

నల్లకుంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పార్టీ నాయకుడు కేపీ మురళీకృష్ణ అన్నారు. హైదర్‌గూడలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల తర్వాత రాష్ట్ర ప్రజలకు నూతన రేషన్‌కార్డులు అందించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని పేర్కొన్నారు. రేషన్‌కార్డులతో పాటు పేదలకు సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, ప్రజలందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు వేంకటేశ్వరస్వామి హుండీ లెక్కింపు

చిక్కడపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు హుండీ లెక్కింపు ఉంటుందని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ అన్నపూర్ణ తెలిపారు.

హోమియోపతి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డా.బస్వానందం



బస్వానందం

రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హోమియోపతి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిక్కడపల్లికి చెందిన ప్రముఖ హోమియోపతి డాక్టర్ దండేపు బస్వానందం నియమితులయ్యారు. ఇటీవల కరీంనగర్‌లో సంఘం జాతీయ అధ్యక్షుడు శివమూర్తి, డాక్టర్ ఎన్.వి.రావుల ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ హోమియోపతి సంఘం సమావేశంలో ఆయనను ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. హోమియోపతి వైద్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంఘం పక్షాన కృషి చేస్తానని బస్వానందం మంగళవారం తెలిపారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతు

నల్లకుంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జున్‌నగర్‌లోని పోచమ్మ ఆలయం వీధిలో కుంగిపోయిన మ్యాన్‌హోల్‌కు మంగళవారం అధికారులు మరమ్మతు చేయించారు. మ్యాన్‌హోల్ మరమ్మతు పనులను బీజేపీ డివిజన్ అధ్యక్షుడు చుక్క జగన్ పరిశీలించారు. సమస్యను పరిష్కరించిన జలమండలి మేనేజర్ మజీద్‌కు కాలనీవాసుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సూపర్‌వైజర్ లక్ష్మణ్, స్థానికులు వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహాకాళి అమ్మవారి ఘటం ఊరేగింపు

ముషీరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో మహాకాళి అమ్మవారి ఘటాన్ని మంగళవారం ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారి ఘటానికి స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు చంద్రమౌళి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్‌చారి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామకృష్ణ, రేఖ పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ బోనాలు



బోనాల వేడుకల్లో పాల్గొన్న పీఎఫ్ కమిషనర్లు శివకుమార్, ప్రతాప్

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బర్కత్‌పుర లోని పీఎఫ్ కార్యాలయంలో గల దర్బార్ మైసమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉద్యోగులు బోనం ఎత్తుకుని అమ్మవారికి మొక్కులు సమర్పించారు. బోనాల ఉత్సవాలలో పీఎఫ్ రీజినల్ కమిషనర్లు శివకుమార్, తేజ్ ప్రతాప్‌సింగ్, దర్బార్ మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈపీఎఫ్ స్టాఫ్ యూనియన్ నేతలు గోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి ఆహ్వానం



ఈ నెల 20, 21 తేదీలలో ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో జరిగే బోనాల పండగకు హాజరు కావాలని కోరుతూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగభూషణం, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు.
- రాంనగర్, ఆంధ్రజ్యోతి

కొనసాగుతున్న చండీయాగం

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ధూపదీప నైవేద్య సంఘం ఆధ్వర్యంలో కాచిగూడ తుల్జాభవన్‌లో రెండో రోజు మంగళవారం పంచకుండాత్మక చండీ కుబేర పాశుపతాయాగం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ యాగంలో నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం, మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయ, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్‌గౌడ్, ధర్మప్రచారకులు రామతీర్థనందస్వామి తదితరులు పాల్గొన్నారు.

నృత్య గురువులకు నిధులు కేటాయించాలి

● కోవిద ఆర్ట్స్, కల్చరల్ అకాడమీ అధ్యక్షురాలు డా.అనూహ్యారెడ్డి



డా.అనూహ్యారెడ్డిని సన్మానిస్తున్న ప్రజా సాంస్కృతిక వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నృత్య గురువులకు జీవనోపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని, నృత్య గురువులను తెలంగాణ భాషా, సాంస్కృతిక మండలిలో సభ్యులుగా చేర్చాలని కోవిద ఆర్ట్స్, కల్చరల్ అకాడమీ అధ్యక్షురాలు డా.అనూహ్యారెడ్డి కోరారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక వేదిక, కోవిద ఆర్ట్స్, కల్చరల్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో నృత్య గురువుల సమస్యలపై తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడారు. నృత్య గురువులకు భారతదేశంలో విశిష్టమైన స్థానం ఉందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక, సంగీత, నృత్య అకాడమీ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి పాఠశాలలో ఒక నృత్య టీచర్‌ను నియమించాలని, కల్చరల్ కోటా కూడా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం అనూహ్యారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో గోవింద ఆర్ట్స్ కల్చరల్ అకాడమీ సలహాదారు పీఎస్ఎన్ మూర్తి, నృత్య గురువులు రమణ సిద్ధి, ఇందిర, సురేష్‌గౌడ్, అనుదీప్తి, హిందుమతి, రాధిక, లావణ్య, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏసీఎల్ ఇన్‌చార్జిగా ప్రభాకర్

చిక్కడపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్(ఏఎల్ఓ)గా ఉన్న ప్రభాకర్‌ను ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (ఏసీఎల్)-3గా నియమించారు. ఈ మేరకు కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి, ఇన్‌చార్జి కమిషనర్ దానకిషోర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్మికుల సంక్షేమం కోసం పని చేస్తానని ప్రభాకర్ చెప్పారు.

తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా బోనాలు

● టీపీసీసీ నాయకురాలు గుర్రం చంద్రకళ



మాట్లాడుతున్న చంద్రకళ

రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రాష్ట్ర ప్రభుత్వం బోనాల పండుగను నిర్వహిస్తుందని టీపీసీసీ నాయకురాలు గుర్రం చంద్రకళ అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బోనాల ఏర్పాట్లను ఘనంగా నిర్వహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌లు అన్ని ఆలయాల వద్ద మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారని అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో ఆదివారం జరిగే బోనాల పండగకు ప్రభుత్వం సుమారు రూ.1.10కోట్ల నిధులు విడుదల చేసిందని చెప్పారు. ముషీరాబాద్‌లో జరిగే బోనాల పండగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఆమె కోరారు.



బీసీ మహాధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ నేతలు

బీసీ మహాధర్నాకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

చిక్కడపల్లి/ రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మంగళవారం నిర్వహించిన మహాధర్నాకు గాంధీనగర్, రాంనగర్ డివిజన్ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, రాంనగర్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ప్రధానకార్యదర్శి రవి, నరేశ్, కిరణ్, శ్రీనివాస్, శ్రీనివాస్‌గుప్త, నాయకులు శ్యామ్, గోపి, రాజుయాదవ్, కార్తీక్‌యాదవ్, శివ, సాయి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రెండు బైకులు ఢీ.. ఒకరి పరిస్థితి విషమం

అంబర్‌పేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అంబర్‌పేట సీఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేటకు చెందిన అబ్దుల్ కలీల్ (48) ఈ నెల 14న సాయంత్రం 4.30 గంటల సమయంలో అలీకేఫ్ చౌరస్తా వద్ద సామగ్రి కొనుగోలు చేసి రాంగ్‌రూట్‌లో మూసారాంబాగ్ బ్రిడ్జి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో మూసారాంబాగ్ బ్రిడ్జి నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం కలీల్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో కలీల్ తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం అతణ్ని వెంటనే అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కలీల్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు అంబర్‌పేట పోలీసులు తెలిపారు.

మైనర్లను పనికి తీసుకెళ్తున్న వ్యక్తి అరెస్ట్

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మైనర్లను పనికి తీసుకెళ్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపారు. ఆపరేషన్ ముష్కాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇర్ఫాన్ ఉల్లా (28) ఇద్దరు మైనర్ బాలురలను కంపెనీలో పనికి తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి ఇద్దరు పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించినట్లు సీఐ తెలిపారు.

బాలిక పరార్

బర్కత్‌పుర: నింబోలిఅడ్డ బాలిక సదన్ నుంచి ఓ మైనర్ బాలిక పరారైంది. కాచిగూడ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సైదాబాద్‌కు చెందిన బాలిక(14) నింబోలిఅడ్డ సదన్‌లో ఉంటుంది. సోమవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో సదన్ మెయిన్ గేట్ దూకి పరారైంది. బాలిక పరార్‌పై సదన్ సూపర్‌వైజర్ కళ మంగళవారం కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని మహిళ మృతి

బర్కత్‌పుర: పట్టాలు దాటుతూ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. 55 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని మహిళ మంగళవారం ఉదయం మలక్‌పేట రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి మృతి

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చప్పల్‌బజార్‌లో నివాసం ఉంటున్న అశోక్ (50) మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మంగళవారం చప్పల్‌బజార్ ఎస్‌వీఎస్ ఆస్పత్రి వెనుక చనిపోయి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి అశోక్ మృతదేహం స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నరేశ్ తెలిపారు.